# ములుగు, భూపాలపల్లికి జననేత

- నేడు రెండు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు
- హాజరుకానున్న బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్
- సభా స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి



భూపాలపల్లిలో సిద్ధమైన ప్రజా ఆశీర్వాద సభా వేదిక

ములుగు/ జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. మొదట మధ్యాహ్నం 3 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డు పక్కన తంగేడు మైదానంలో అభ్యర్థి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు కేసీఆర్ హాజరవుతారు. ఆయన ప్రత్యేక హెలిక్యాప్టర్ ములుగుకు చేరుకోనున్నారు. లక్ష మంది హాజరయ్యే సభకు బీఆర్ఎస్ శ్రేణులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని 2 మండలాల నుంచి ప్రజలు తరలిరానున్నారు. మండలానికి 10వేల మంది చొప్పున తరలించి జిల్లా కేంద్రం నుంచి అత్యధికంగా ప్రజలను తరలించే నేతలు ప్లాన్ చేశారు. సభా ప్రాంగణానికి 500 మీటర్ల దూరంలో ప్రత్యేక హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. సభకు వచ్చే ప్రజల కోసం లక్ష కుర్చీలతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నారు. గురువారం ఉదయం ఎస్పీ గౌష్‌ఆలం రక్షణ ఏర్పాట్లను పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. సాయంత్రం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, మండలాల ఇన్‌చార్జిలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఏరువ సతీశ్‌రెడ్డి, సాంబారి సమ్మారావు, మెట్టు శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### భూపాలపల్లి నియోజకవర్గంలో..

బీఆర్ఎస్ జయశంకర్ జిల్లా కార్యాలయం వెనక ఏర్పాటు చేస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు వేదికను సిద్ధం చేశారు. సుమారు లక్ష మందికి సరిపోయేలా ఏర్పాట్లు చేశారు. నేడు సాయంత్రం 4గంటలకు మంజూర్‌నగర్‌లోని కలెక్టరేట్ వద్ద గల హెలిప్యాడ్ వద్దకు సీఎం కేసీఆర్ చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో సభా స్థలికి చేరుకుంటారు. ఈ సందర్భంగా సభా స్థలి, హెలిప్యాడ్‌ను ఎమెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య గురువారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి ఎదురుగా ఉన్న స్థలంతో పాటు సన్‌వ్యాలీ పాఠశాల సమీపంలో, సభా స్థలికి సమీపంలో సింగరేణి ఇసుక నిల్వ చేసే ఖాళీ స్థలాలను పార్కింగ్ కోసం పోలీసులు కేటాయించారు. ఎస్పీ కిరణ్‌ప్రభాకర్ ఖారె, భూపాలపల్లి డీఎస్పీ రాములు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ నుంచి ప్రత్యేక పారా మిలటరీ పోలీస్ బలగాలు ఇప్పటికే భూపాలపల్లికి చేరుకున్నాయి. డీఎస్పీ రాములు పోలీసులకు విధులు కేటాయించారు. ఎమ్మెల్యే గండ్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి 10వేల మందిని సమీకరించాలని ఆయా మండలాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో పాటు పట్టణ బీఆర్ఎస్ నాయకులు ఆయా వార్డుల నుంచి 30వేల మందిని సమీకరించాలని ఎమ్మెల్యే కోరారు. మొత్తం లక్ష మందితో సభ నిర్వహించేందుకు ప్లాన్ చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు జనసమీకరణలో నిమగ్నమయ్యారు. సింగరేణి కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు డ్యూటీ డ్రెస్‌తో పాటు తట్టా, చెమ్మాస్, టోపీతో సభకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. కేసీఆర్ సభ నేపథ్యంలో పట్టణంలో భారీగా ఫ్లెక్సీలు, గులాబీ తోరణాలు వెలిశాయి.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# పొలిటికల్ టూరిస్టులతో ఒరిగేది శూన్యం

- ప్రణాళికలు లేని పార్టీలు కాంగ్రెస్, బీజేపీ
- కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే చల్లా
- ఖిలావరంగల్, సంగెం మండలాల్లో ప్రచారం

ఖిలావరంగల్, నవంబర్ 23 : ఢిల్లీ, కర్ణాటక నుంచి వచ్చే పొలిటకల్ టూరిస్టులతో కలిగే ప్రయోజనం శూన్యమని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్‌లోని గాడిపల్లి, బొల్లికుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జోరు వానను కూడా లెక్క చేయకుండా ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు మద్దతుగా వచ్చారు. ఖమ్మం ప్రధాన రహదారి నుంచి బొల్లికుంట వరకు యువత భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంపై పక్కా ప్రణాళికలు లేని పార్టీలు కాంగ్రెస్, బీజేపీ అని అన్నారు. సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. వ్యవసాయంపై కనీస అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతుంటే ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. సీఎం కేసీఆర్ పాలనలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. సమర్థవంతమైన పాలనను అందిస్తున్న కేసీఆర్‌ను ప్రజలు దీవించాలన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం, అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలను ప్రకటిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మరోసారి గెలిపిస్తే రాబోయే తరానికి కూడా బంగారు బాటలు వేస్తానన్నారు.

### చల్లాను గెలిపించాలి : ఎంపీ దయాకర్

అనునిత్యం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పరితపించే ఎమ్మెల్యే చల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గద్దె బాబు, ఖిలావరంగల్ పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ సోల్తీ భూమాత, నాయకులు కత్తెరపల్లి దామోదర్, జన్నుపాల రాంబాబు, సోల్తీ నరేందర్ పాల్గొన్నారు.

### బీఆర్‌స్‌లో చేరికలు..

గాడిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే చల్లా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఆయన గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీపై, నాపై నమ్మకంతో పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి పరకాలలో గులాబీ జెండా సత్తా ఏంటో చాటాలన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు మెంబర్ జంగ కుమారస్వామి, కొత్తపల్లి అయిలయ్య, బట్టమేకల కిరణ్, రమేశ్, గాలి రవి, పసునూరి ఉప్పల్ స్వామి, కడిదెల విజేందర్, పసునూరి కుమార్, మేకల స్వామి, పసునూరి పవన్, గువ్వల ఆర్య, రాపాల సంజన్, పసునూరి నవీన్, ఐత రవి, గొల్లపల్లి నాగరాజు, నవీన్, తాళ్లపల్లి నాగరాజుతో పాటు మరో 50 మంది ఉనారు.



సంగెం : షాపురంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

### అందుబాటులో ఉండే నాయకుడిని..

సంగెం : కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కరువై పక్క నియోజకవర్గం నుంచి అరువు తెచ్చుకున్నారని పరకాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉదయం మండలంలోని పెద్దతండా, షాపురం, సాయంత్రం లోహిత, సోమ్లాతండా, తీగరాజుపల్లి, రాత్రి కుంటపల్లి, సంగెం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్ షోల్లో మాట్లాడారు. పరకాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గతంలో నర్సంపేటలో రెండు సార్లు ఓడిపోయి పశ్చిమ నియోజకవర్గం వచ్చాడని, అక్కడి ప్రజలు తరిమికొడితే నర్సంపేటకు మళ్లీ వాపస్ పోయాడని, ఇప్పుడు పరకాల నియోజకవర్గానికి వచ్చాడని, అలాంటి నాయకుడికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. తాను 10 ఏండ్లుగా ప్రజలకు అండగా ఉన్నానని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదించాలన్నారు. తాను ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, కష్టాల్లో తోడుగా ఉంటానని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన సీఎం కేసీఆర్‌కు గిరిజనులు అండగా నిలబడాలన్నారు. నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కందకట్ల కళావతి, జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు రవి, సట్ల రాజు, కర్జుగుత్త రమ-గోపాల్, మంగ్యా నాయక్, కావటి వెంకటయ్య, గుండేటి బాబు, ఎంపీటీసీలు అడ్డగట్ల దుర్గారావు, రంగరాజు నర్సింహస్వామి, మెట్టుపల్లి మల్లయ్య, నాయకులు కందకట్ల నరహరి, సొసైటీ చైర్మన్లు సంపత్‌గౌడ్, వేల్పుల కుమారస్వామియాదవ్, మాజీ ఎంపీపీ వీరాచారి, దొనికెల శ్రీనివాస్, కోడూరి సదయ్య, పులి వీరస్వామి, మునుకుంట్ల కోటేశ్వర్, అప్పె నాగార్జున శర్మ, ఉప సర్పంచ్ కక్కెర్ల శరత్ పాల్గొన్నారు.

# అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా..

- అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్
- 61, 62వ డివిజన్లలో విస్తృత ప్రచారం

కాజీపేట, నవంబర్ 23 : ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు కారు గుర్తుకు ఓట్లు వేయాలని చీఫ్ విప్, పశ్చిమ బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. కాజీపేట పట్టణంలోని 62వ డివిజన్ వైఎస్సార్ నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్, 61వ డివిజన్ అధ్యక్షుడు కుమ్మరి కోటిలింగం ఆధ్వర్యంలో నాన్యతండాలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు పార్టీలో చేరగా, కండవాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమలో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి ఐదేళ్లు ప్రజా సేవకుడిగా పని చేస్తానన్నారు. ఎన్నికలు రాగానే వివిధ పార్టీల రాజకీయ నాయకులు డివిజన్లలో తిరుగుతున్నారని, తెలంగాణ ఉద్యమం, కరోనా కష్టకాలం, నగరంలో వరదలు వచ్చినప్పుడు వారికి ప్రజల బాధలు కనిపించలేదా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధికి ఆకర్షితులైన పలువురు బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. పట్టణంలోని వైఎస్సార్ గుడిసె వాసులకు ఎల్లవేళా అండగా ఉంటానన్నారు. సీఎం కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎం పదవిని చేపట్టడం ఖాయమన్నారు. నగరంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎన్నికల కన్వీనర్ జనార్దన్ గౌడ్, ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ మిడిదొడ్డి స్వప్న, 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు, నాయకులు తేలు సారంగపాణి, కాటాపురం రాజు, సంపత్ రావు, బైరి రవి, ఫర్హాన్, గోల్కొండ రాంబాబు, యుగేంధర్ పాల్గొన్నారు.

### వాకర్స్‌కు కేసీఆర్ భరోసాపై వివరించిన దాస్యం

హనుమకొండ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన కేసీఆర్ భరోసా గురించి చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ప్రజలకు వివరించారు. బాలసముద్రంలోని ఏకశిల పార్కు(ప్రొఫెసర్ జయశంకర్ స్మృతి వనం)లో వాక్ అండ్ టాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా వాకర్స్‌ను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధిలో వాకర్స్‌ది కీలక పాత్ర ఉండాలని సూచించారు. నియోజకవర్గంలో అడుగడుగునా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైతే మరింత అభివృద్ధి జరుగుతుందని, 30న జరుగనున్న ఎన్నికల్లో అందరూ సహకరించాలని కోరారు.



హనుమకొండ : బాలసముద్రం ఏకశిల పార్కులో వాకర్స్‌ను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్